క్లుప్తంగా

రేవంత్‌రెడ్డిని కలిసిన బండి రమేష్



కూకట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి అభ్యర్థి బండి రమేష్ శుక్రవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ భారీ మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

ఉచిత ధ్యాన శిక్షణ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి వివేకానందనగర్ కాలనీలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ప్రతిరోజు ఉదయం 6 నుంచి 7.3 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 7గంటల వరకు ఉచిత ధ్యాన యోగ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. యువతకు క్రమశిక్షణ, పెద్దల పట్ల వినయ విధేయత, జ్ఞాపకశక్తి, చెడు వ్యసనాలైన ధూమపానం, మద్యపానం వంటి వాటి నుంచి విముక్తి కలిగేలా ధ్యాన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదే విధంగా చదువులో రాణించేందుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా స్త్రీ, పురుషులు ధ్యాన శిక్షణలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

నివాళి




సక్కుబాయి మృతదేహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని తులసీనగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మాతృమూర్తి సక్కుబాయి మృతి చెందారు. శుక్రవారం ఈ విషయం తెలుసుకున్న అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగం ఆయన నివాసానికి వెళ్లి శ్రీనివాస్, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సామ కొండల్‌రెడ్డి, లక్ష్మి, సత్యమ్మ, రాములు తదితరులు పాల్గొన్నారు.


రేపటి నుంచి శివపురాణం ప్రవచనం

మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీశృంగేరి శారద శంకర మఠంలో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు నిట్టల కిరణ్మయి శివపురాణం ప్రవచనం చేస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8గంటల వరకు ఈ ప్రవచన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

హరిహర క్షేత్రంలో పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు



మూసాపేట: భరత్‌నగర్‌కాలనీలోని హరిహర క్షేత్రంలో కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశ్వేశ్వరస్వామికి లక్ష బిల్వార్చనను అర్చకులు కృష్ణమూరి సమక్షంలో వైభవంగా జరిగాయి. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బిల్వార్చన పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. 4వ తేదీన ప్రత్యేక అభిషేకాలు ఉంటాయని ఆయన తెలిపారు.

శత చండీ మహాయాగం

వెంకటేశ్వరనగర్‌కాలనీ: బంజారాహిల్స్ రోడ్ నంబర్–14లోని శ్రీవిజయ గణపతి ఆలయంలో లోకకల్యాణార్థం నిర్వహిస్తున్న శత రుద్ర యాగ సహిత శత చండీ మహా యాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. గత నెల 25న ప్రారంభమైన మహాయాగం ఈ నెల 4వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు.

మహిళ అదృశ్యం

బాలానగర్: బంధువుల ఇంటికి వెళ్లిన ఓ మహిళ తిరిగి ఇంటికి రాని సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది రుఖ్సీ, శివకుమార్ దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఫిరోజ్‌గూడలో నివాసం ఉంటున్నారు. రుఖ్సీ (23) గత నెల 30వ తేదీన బోయినపల్లిలోని తన బంధువుల ఇంటికి వెళ్లింది. అదే రోజు సాయంత్రం అక్కడి నుంచి తన ఇంటికి వెళుతున్నాని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో పలు చోట్ల గాలించినప్పటికి ఆచూకీ లభ్యం కాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అభ్యర్థుల్లో టెన్షన్

అంతు చిక్కని ఓటర్ల నాడి

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఎన్నికలు ముగియడంతో కూకట్‌పల్లి బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులకు గెలుపుపై టెన్షన్ ప్రారంభమైయింది. గెలుపు కోసం అహర్నిషలు సర్వశక్తులను ఒడ్డారు. ప్రతి అవకాశాన్ని జారవిడుచుకోకుండా వ్యూహాత్మకంగా ముందుకు సాగారు. ఓటర్లు అభ్యర్థుల రాజకీయ భవితవ్యాన్ని ఎలక్ట్రానిక్ యంత్రాల్లో భద్ర పర్చారు. ఈనెల 3వ తేదీ ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరగనుంది. దీంతో గెలుపుపై ఎవరికి వారు లెక్కలు వేసుకుంటున్నారు.

◆ ప్రజలు తమను ఆదరించారంటే తమను అంటూ అభ్యర్థులు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. పైకి ఎంత చెప్పుకుంటున్నా లోలోన మాత్రం ఎవరి భయం వారికి ఉంది. విచ్చల విడిగా డబ్బు, వ్యక్తిగతంగా చేమటోడిసినా ఫలితాలను మాత్రం ఏ ఒక్కరూ అంచనాలు వేయలేకుండా ఉన్నారు. ఆయా ప్రాంతాలు, ఆయా వర్గాలు, ఆయా సంఘాలు తమకే అండగా నిలిచారని అభ్యర్థులు లెక్కలేసుకుంటున్నారు. తమ పార్టీ శ్రేణుల ద్వారా ఓట్ల గణంకాలను తెప్పించుకుని బేరజు వేసుకుంటున్నారు.

◆ కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో మాధవరం కృష్ణారావు (బీఆర్ఎస్), బండి రమేష్ (కాంగ్రెస్), ముమ్మారెడ్డి ప్రేంకుమార్ (జనసేన)ల మధ్య పోటీ కొనసాగింది. నియోజకవర్గంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా తాను చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పిలిస్తే పలికే అన్నగా పేరు తెచ్చుకున్న తనకు ప్రజల ఆదరాభిమానాలు ఎన్నికల్లో కలిసి వచ్చాయని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం తెచ్చిన ఆరు గ్యారంటీ సంక్షేమ పథకాలతో ఆదరించారని కాంగ్రెస్, తమ సామాజిక వర్గం ఓట్లు కలసి రావడంతో పాటు పవన్‌కల్యాణ్ చరిష్మా, బీజేపీ సపోర్టుతో ప్రజలు ఎన్నికల్లో తమను ఆశీర్వదించారని జనసేనా పార్టీలు అంటున్నాయి.

◆ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికలు అభ్యర్థులను తీవ్ర ఉత్కంఠకు గురిచేశాయి. ఓటరు నాడీ అంతు చిక్కకుండా ఉంది. ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా ఓటర్లు తమ తీర్పు నిచ్చారు. ప్రజలు ఎక్కడ కూడా తమ మనోగతాన్ని తమ ఓటింగ్ అంతరంగాన్ని చెప్పడం లేదు. దీంతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎదుర్కొంటున్న టెన్షన్ అంతా ఇంతా కాదు.

◆ పార్టీ శ్రేణులు వచ్చి ఆహో, ఓహో అంటూ ఎంత చెప్పుకుంటతున్నా అభ్యర్థులు మాత్రం వాటిని విశ్వసించడం లేదు. లోలోన తీవ్ర ఉత్కంఠకు లోనవుతున్నారు. కూకట్‌పల్లిలో ఓటింగ్‌లో పాల్గొన్న ఓటర్లు ఎలక్ట్రానిక్ యంత్రాల్లో పార్టీ అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చి ఎక్కడ కూడా వాటిని బహిరంగ పర్చడం లేదు. దీంతో ఓటర్ల నాడి తెలియక బీఆర్ఎస్, కాంగ్రెస్, జనసేన పార్టీల అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారు.

చివరి 2గంటల్లో లక్ష ఓట్లు పడ్డాయి

గెలుపోటములు నిర్ణయించేది చివరి ఓట్లే!

అత్యధికంగా సేవాలాల్ నగర్‌లో 83.91 శాతం

అత్యల్పంగా మలేషియా టౌన్‌షిప్‌లో 37.40 శాతం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల తీరు పలు అనుమానాలకు దారి తీస్తోంది. ఉదయం నుంచి 3 గంటల వరకు ఓటు హక్కు నమోదు చేసుకోవటానికి ప్రజలు ముందుకు రాలేదు. ఆ ఆఖరి గంటలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ప్రజల తీర్పు పలు సందేహాలను వెలిబుచ్చుతుంది. మధ్యాహ్నం 3 గంటల వరకు 32 శాతం వరకే ఉన్న పోలింగ్ 4 గంటల తరువాత సుమారు లక్ష మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరంతా ప్రభుత్వ అనుకూలమైన ఓటర్లా, ప్రతికూలమైన ఓటర్‌లా అనే సందేహాలు రేకెత్తుతున్నాయి.

◆ ఆఖరి గంటలో వచ్చిన ఓటర్లు ఏమైనా నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టిస్తే అభ్యర్థుల జాతకాలు తారుమారు అయ్యే అవకాశం లేకపోలేదు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు 5.32 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది.

◆ అదే విధంగా 11 గంటలకు 15శాతం ఓటింగ్ కూడా నమోదు కాలేదు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 22 శాతం మాత్రం ఓటింగ్ జరిగినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. మధ్యాహ్నం తరువాత పోలింగ్ ఇంకా మందకోడిగా సాగింది.

◆ 3 గంటల వరకు 32.74 శాతం పోలింగ్ జరగగా, ఆఖరి రెండు గంటల్లో 32 నుంచి ఏకంగా 53.96 శాతానికి పెరిగిందంటే ఓటర్లు అంత పెద్ద సంఖ్యలో తరలి రావటానికి ఏమైనా కారణాలు ఉండొచ్చా అని పలువురు భావిస్తున్నారు.

◆ చివరి నిమిషంలో లక్ష ఓట్లు పోలయ్యాయంటే కూకట్‌పల్లి నియోజకవర్గంలో కూడా ప్రభుత్వ వ్యతిరేక ఓటు నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టిస్తుందా లేక ప్రభుత్వ అనుకూల ఓటర్లే ఓటింగ్‌లో పాల్గొన్నారా అర్థం కాని పరిస్థితి దాపురించింది.

◆ నియోజకవర్గంలోని బాలాజీనగర్ డివిజన్‌లోని సేవాలాల్ నగర్ 217వ బూత్‌లో అత్యధికంగా 83.91 శాతం ఓట్లు పోలయ్యాయి. అదే విధంగా కేపీహెచ్‌బీ డివిజన్ మలేషియా టౌన్‌షిప్‌లోని 338వ బూత్‌లో అత్యల్పంగా 37.40 శాతం ఓట్లు పోలయినట్లు అధికారులు తెలుపుతున్నారు. చివరి నిమిషంలో విద్యావంతులు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. బస్తీల్లో మధ్యాహ్నం వరకు భారీ ఎత్తున పోలింగ్ కాగా చివరి గంటలో కాలనీ, విల్లాల్లో ఓటింగ్ నమోదు జరిగినట్లు తెలుస్తోంది. చివరి నిమిషంలో వేసిన ఓట్లే గెలుపోటములను నిర్ణయించనున్నట్లు రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.

అంతర్జాతీయ అనుసంధానమే లక్ష్యం

డెల్లా లీడర్స్ క్లబ్ హైదరాబాద్ లక్ష్యం

రాయదుర్గం: పారిశ్రామికవేత్తలను అంతర్జాతీయ అనుసంధానం చేయడమే డెల్లా లీడర్స్ క్లబ్ హైదరాబాద్ లక్ష్యమని వక్తలు పేర్కొన్నారు. నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని షెరటాన్ హోటల్‌లో శుక్రవారం రాత్రి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీరామ్ బిల్డర్ అండ్ డెవలపర్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాలాజీరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంటర్‌ప్రెన్యూర్ కమ్యూనిటీ బిల్డర్, జిమ్మీ మిస్త్రీ డెల్లా లీడర్స్ క్లబ్ హైదరాబాద్ చాప్టర్ బోర్డును ప్రకటించారు. అంత్యంత క్యూరేటెడ టెక్నాలజీ ఎనేబుల్డ్ గ్లోబల్ ప్లాట్‌ఫామ్ అయిన డెల్లా లీడర్స్ క్లబ్ అనేది విజ్ఞాన మార్పిడి, జీవనశైలి మార్గదర్శకత్వం, సామాజిక బాధ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల నాయకులకు మద్దతు ఇచ్చే పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తోందన్నారు.



షెరటాన్ హోటల్‌లో డీఎల్‌సీ హైదరాబాద్ సమావేశంలో పాల్గొన్న అతిథులు

కార్యక్రమంలో కొన్సెలేజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు ఎండీ సుహెల్ సేథ్, విశ్రాంత ఐఏఎస్ అధికారి బిపి ఆచార్య, ఐటీ నిపుణులు జేపీ చౌదరి, బజాజ్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సీఈఓ కరణ్ బజాజ్ ప్రసంగించారు.

రిటైర్ అయిన నెలలో పింఛన్ పత్రాలు మంజూరు

భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్

పటాన్‌చెరు: పదవీ విరమణ పొందిన నెలలోనే పింఛన్ పత్రాలు మంజూరు చేస్తున్నామని భవిష్య నిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలోని పీఎఫ్ కార్యాలయంలో నవంబర్‌లో 17 మందికి పింఛన్ మంజూరు చేయగా అందులో 9 మందికి పింఛను మంజూరు పత్రాలను అందజేశారు. ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ మాట్లాడుతూ... యాజమాన్యాలు, రిటైరయిన వారు పింఛను దరఖాస్తు ఫారమ్ తో పాటుగా ఇతర సంబంధిత పత్రాలు జతచేసి సకాలంలో అందజేస్తే వారికి రిటైర్ అయిన నెలలోనే పింఛను మంజూరు పత్రాలను అందజేస్తామన్నారు . కార్యక్రమంలో అసిస్టెంట్ పి.ఎఫ్ కమిషనర్ ఆర్.శ్రీదేవి, అకౌంట్స్ అధికారి మనోజ్ పాల్గొన్నారు.

యువతికి అరుదైన శస్త్రచికిత్స

గొంతులోని చీముగడ్డను తొలగించిన ఈఎన్‌టీ వైద్యులు

సుల్తాన్‌బజార్: గొంతులో చీముగడ్డ తొలగించి ఓ యువతి ప్రాణాలను కోఠి ఈఎన్టీ ఆస్పత్రి వైద్యులు కాపాడారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన శృతి (15) కొంతకాలంగా గొంతులో ఏమీ మింగకుండా బాధపడుతుండేది. గత నెల 28న రాత్రి 11 గంటలకు కోఠి ఈఎన్టీ ఆస్పత్రికి రావడంతో ఈఎన్టీ వైద్యులు ఆమెను అడ్మిట్ చేసుకుని 29న సిటీ స్కాన్‌తో పాటు అన్ని రకాల రక్తపరీక్షలు నిర్వహించారు. గొంతులో ఒక పెద్ద చీముగడ్డ ఉన్నట్లుగా తేలడంతో గొంతు వెనుకభాగం నుంచి ఛాతి పైభాగానికి కూడా విస్తరించినట్లు గుర్తించారు. ఆలస్యం చేస్తే ఈ చీముగడ్డ మరింత పెరిగి శ్వాసనాళానికి కూడా అడ్డుపడి రోగి ప్రాణాలకు ప్రమాదంగా మారే అవకాశం ఉందని వైద్యులు వెంటనే శస్త్రచికిత్స చేశారు. ఈ చీముగడ్డ నుంచి దాదాపుగా 300 ఎంఎల్ చీమును తీశామని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. చీముగడ్డను తొలగించి రోగి ప్రాణాలను కాపాడిన వైద్య బృందమైన డాక్టర్ ఆనందచార్య, డాక్టర్ సంపత్‌రావు, డాక్టర్ తణి, డాక్టర్ స్వామి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ నిఖిల, సీనియర్ అసిస్టెంట్లను, పోస్టు గ్రాడ్యుయేట్లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ అభినందించారు.



శస్త్రచికిత్స చేసిన ఈఎన్‌టీ వైద్య బృందం

3న బాలబృందావనం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం చిల్డ్రన్స్ వీక్లీ కార్యక్రమంలో భాగంగా 'బాలబృందావనం' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 'ది గేమ్ ఆఫ్ కర్మ' పేరిట నిర్వహించే కార్యక్రమంలో 9 నుంచి 14 ఏళ్ళ లోపు పిల్లలకు పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించవచ్చు.

గంజాయి మత్తులో దాడి

పటాన్‌చెరు టౌన్: గంజాయి మత్తులో పారిశుద్ధ్య కార్మికులపై ఓ యువకుడు దాడి చేసిన సంఘటన శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలో చోటుచేసుకుంది. కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం...పటాన్‌చెరు శాంతినగర్ కాలనీలో గంజాయి మత్తులో ఉన్న యువకుడు మంటలో చేతులు పెట్టగా పారిశుద్ధ్య కార్మికులు వద్దని వారించినందుకు వారిపై దాడి చేశాడు.కరత్రో తలపై కొట్టడంతో పారిశుద్ధ్య కార్మికుడు యాదగిరికి తలకు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు 10 కుట్లు వేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యుత్ షాక్‌తో కూలీ మృతి

పటాన్‌చెరు టౌన్: విద్యుత్ షాక్ తగిలి కూలీ మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బంధం కొమ్ములో జరుగుతున్న భవనం పనుల్లో ఒరిసాకు చెందిన సత్యబ్రత్ చంద్ర(20) పది నెలలుగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో 30వ తేదీ పనిచేసే చోట మిషన్‌తో తొమ్మిదో ఫ్లోర్‌లో రాడ్ కట్ చేసి, ఆ తర్వాత విద్యుత్ బాక్స్ నుండి మిషన్‌కు సంబంధించిన వైర్ తీస్తుండగా షాక్ తగిలింది.దీంతో తీవ్రంగా గాయపడ్డ సత్యబ్రత్ చంద్రను స్థానికంగా ఆసుపత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు వెల్లడించారు సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అపార్ట్‌మెంట్ కాంట్రాక్టర్ సంజయ్, సైట్ మేనేజర్ సురేష్ బాబుల నిర్లక్ష్యం కారణంగానే విద్యుత్ షాక్ తగిలి తన కుమారుడు మృతి చెందాడని తండ్రి శీతాకాంత్ శుక్రవారం ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అన్నమయ్య సంకీర్తనాలాపన



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శుక్రవారం ది ఫ్యామిలీ మెన్ యువ దర్శకుడు రాజ్ నిడిమోరుకు చిత్రబ్రహ్మ బిరుదును శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి అందజేశారు. యువ దర్శకుడు అందించిన ఫర్జీ, గోవా గాన్, డీ ఫర్ దోపిడి, సినిమా బండి, స్త్రీ వెబ్ సిరీస్ ద్వారా పేరు తెచ్చుకున్న చిత్రదర్శకుడు రాజ్ నిడిమోరుకి చిత్రబ్రహ్మ అనే బిరుదును అందజేశారు. అనంతరం శోభారాజు శిష్యబృందం అన్నమయ్య కీర్తనలను అలపించారు.

మనూలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

రాయదుర్గం : ప్రస్తుత పరిస్థితి 'మనిషి వర్సెస్ మెషిన్' అన్నట్లుగా మారిందని మనూ వైస్‌చాన్సలర్ ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం నిర్వహిస్తున్న 'ఇంజనీరింగ్ (ఆర్ఐసీఈ–2023)లో ఇంటిలిజెంట్ కంప్యూటింగ్‌లో పరిశోధనలు' అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఉర్దూ యూనివర్శిటీ, సెంట్రల్ అమెరికాలోని యూనివర్శిడాడ్ డాన్‌బాస్కో సహకారంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ప్రారంభసమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మనిషి మేధస్సు శాశ్వతమైన ఆధిపత్యాన్ని కలిగి ఉంటుందన్నారు. అనంతరం సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు.



సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ సయ్యద్ ఐనుల్ హసన్

గెలుపుపై ఎవరి లెక్కలు వారివే..

- మేడ్చల్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరిలో పెరిగిన ఓటింగ్
- కూకట్‌పల్లిలో తగ్గిన పోలింగ్, ఉప్పల్‌లో గతంలోదే పునారావృతం
- విజయం తమదేనంటూ.. లెక్కలపై కుస్తీ పడుతున్న అభ్యర్థులు
- నగర శివారు మేడ్చల్ జిల్లాలో ప్రధాన పార్టీల ఎగ్జిట్ పోల్ టెన్షన్

సాక్షి, మేడ్చల్‌జిల్లా: పోలింగ్ ప్రక్రియ ముగియడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపుపై ఎవరి ధీమా వారిదేనన్న రీతిలో పలు అంచనాలతో ఓట్ల లెక్కలపై కుస్తీ పడుతున్నారు. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో బస్తీలు, గ్రామాలు, డివిజన్లు/వార్డులతో సహా పోలైన ఓట్లకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల వారీగా వివరాలు తెలుసుకోవడంతో పాటు తమకు ఎంతమేర ఓట్లు పడ్డాయనే దానిపై అనుచరుల నుంచి నివేదికలు తెప్పించుకుంటున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ముఖ్య అనుచరులతో సమావేశాలు ఏర్పాటు చేసి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకుంటున్నారు.

పెరిగిన ఓటింగ్‌పై..

మేడ్చల్‌లో 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 60.82 శాతం పోలింగ్ నమోదు కాగా, 2018 ఎన్నికల్లో 60.56 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో మాత్రం గతం కంటే ఎక్కువగా 62.24 శాతం పోలింగ్ నమోదైంది. ఈ నియోజకవర్గంలో పెరిగిన ఓటింగ్ ఎవరి గెలుపునకు దోహదపడగలదని ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు లెక్క లేసుకుంటున్నారు. ఓట్ల పెరుగుదల ప్రజల మార్పునకు నిదర్శనంగా భావిస్తున్న కాంగ్రెస్ గెలుపు ధీమాను వ్యక్తం చేస్తోంది. ఓట్లు పెరిగినా బీజేపీ చీల్చి ఓట్టింగ్ శాతం తన మెజార్టీని ఖరారు చేస్తుందని బీఆర్ఎస్ లెక్కలు వేస్తోంది. బీజేపీ కూడా అగ్రనేతల ప్రచారంతో ఓట్ల పెరుగుదలపై ధీమాను ప్రకటిస్తోంది.

- మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా గతంకంటే ఓటింగ్ శాతం పెరిగింది. ఇక్కడ కూడా అభ్యర్థులు గెలుపు, ఓటమిలపై భిన్న స్వరాలు వ్యక్తమవుతుండగా, ప్రధాన పార్టీల అభ్యర్థులు కేంద్రాల వారిగా లెక్కలతో విజయంపై విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు.
- మల్కాజిగిరిలో 2014లో 50.85 శాతం, 2018లో 53.08 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈ ఎన్నికల్లో 54.02 శాతం ఓట్లు పోలయ్యాయి. ఒక శాతం ఓట్ల పెరుగుదలపై లాభనష్టాలపై అభ్యర్థులు బేరీజు వేసుకుంటున్నారు. కుత్బుల్లాపూర్‌లో కూడా 2014లో 48.36 శాతం, 2018లో 55.84 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈ ఎన్నికల్లో గణనీయంగా 57.18 శాతం ఓటింగ్ నమోదైంది. దాదాపు రెండు శాతం పోలింగ్ పెరుగుదలతో విజయ అవకాశాలపై ప్రధాన పార్టీల్లో చర్చ సాగుతోంది.
- కూకట్‌పల్లిలో ఓటింగ్ శాతం తగ్గగా, ఉప్పల్‌లో గతంలో నమోదైన ఓటింగ్ శాతమే పునావృతమైంది. దీంతో ఈ రెండు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల్లో గెలుపు తమదంటే.. తమదేనన్న అభిప్రాయాలను అనుచరుల వద్ద వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. కూకట్‌పల్లిలో 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 49.43 శాతం, 2018లో 57.73 శాతం కాగా, ఈ ఎన్నికల్లో తక్కువగా 53.87 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే, ఉప్పల్‌లో 2014లో 49.86 శాతం, 2018లో 51.54 శాతం నమోదు కాగా, ఈ ఎన్నికల్లో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్ల శాతం 51.54శాతం పునరావృతమైంది.

పోలింగ్ కేంద్రాల వారీగా..

ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఏ పోలింగ్ కేంద్రంలో తమ పార్టీకి మద్దతు లభించిందనే విషయాన్ని సేకరిస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం పోలైన ఓట్లలో తమకు ఎన్ని ఓట్లు వస్తాయని లెక్కలు వేసుకుంటున్నారు. పార్టీ గెలుపు కోసం ఎవరు పనిచేశారు. ఎవరు వ్యతిరేకంగా పనిచేశారనే వివరాలను సైతం తెలుసుకుంటున్నారు.

బెట్టింగ్‌లు మరూ...

గ్రేటర్‌తో సహా శివారు జిల్లాల్లో ఫలితాలపై పలు నియోజకవర్గాలతో పాటు ఇతర ప్రాంతాల్లోని ప్రజలు సైతం బెట్టింగులు కడుతున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు పోలింగ్ కేంద్రాల వారీగా నివేదికలు తెప్పించుకుని పోలింగ్ సరళిని అంచనా వేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం వరకు ఫలితాలు తేలనుండటంతో.. ప్రధాన పార్టీలు గెలుపు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నాయి.



ఎక్కడ చూసినా చర్చ

ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు గెలుపు మీద ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల లబ్ధిదారులు తమనే మద్దతు తెలిపినట్లుగా భావిస్తున్నారు. అలాగే, బీజేపీ అభ్యర్థులు చీల్చే ఓట్లను బట్టి తమ గెలుపు, ఓటమిలతోపాటు మెజార్టీ ఆధారపడి ఉండగలదన్న అభిప్రాయాన్ని బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, అభ్యర్థులు వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు తమను ఆరు గ్యారంటీలు గెలిపిస్తాయనే విశ్వాసంతో ఉండటంతో పాటు ప్రజలు మార్పును కోరుకుంటున్నారన్న అభిప్రాయంతో గెలుపు ధీమాను వెల్లడిస్తున్నారు. బీజేపీ అభ్యర్థులు సైతం తమ అగ్రనేతల ప్రచారాలు కలిసివస్తాయని ఆశిస్తున్నారు. ఎగ్జిట్ పోల్ ఫలితాలను అభ్యర్థులు విశ్లేషించుకుంటున్నారు. వీటితో పాటు రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ అధికారం చేపడుతుందనే దానిపై ప్రస్తుతం నగర శివారు జిల్లాలో జోరుగా చర్చ సాగుతోంది. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు చెందిన నాయకులు తమ పార్టీనే రాష్ట్రంలో అధికారాన్ని చేపడుతుందన్న ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

తలమునకలు

ఓటరు నాడి పట్టుకునేందుకు క్షేత్రస్థాయిలో నేతల కుస్తీలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యింది. అభ్యర్థుల గెలుపోటములపై క్షేత్రస్థాయిలో ఓటర్ల నాడిని పట్టుకునేందుకు రాజకీయ పార్టీల నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. ఎన్నికల ఫలితాలు రాక ముందే వివిధ పార్టీల అభ్యర్థులు ఎవరికెన్ని ఓట్లు పడ్డాయన్న విషయంపై పార్టీ శ్రేణుల వద్ద ఆరా తీస్తున్నారు. రాజకీయ విశ్లేషకులతో సైతం చర్చిస్తూ అంచనా వేసుకుంటున్నారు. అయినా ఒక కొలిక్కి మాత్రం రాలేకపోతున్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సైలెంట్ ఓటింగ్ జరిగిందన్న చర్చ జోరుగా సాగుతోంది. ఎవరికి వారే తమ పార్టీ అభ్యర్థి గెలుస్తున్నాడంటూ జోరుగా ప్రచారం చేసుకుంటున్నారు. అయితే ఆయా పార్టీ నాయకులు తాము ఆ ప్రాంతంలో పట్టు సాధించామని చెప్పలేని పరిస్థితి కనిపిస్తోంది. గత ఎన్నికల్లో ఫలితాలు రాక ముందే పరిస్థితి ఇలా ఉండొచ్చని చెప్పుకునేవారు. కానీ ఈసారి మాత్రం ఎవరు గెలుస్తారో? ఎవరు ఓటమి పాలవుతారో నిర్ధారణకు రాలేకపోతున్నారు.

కంటి సంరక్షణ అవసరం

హఫీజ్‌పేట్ : ప్రతి ఒక్కరికి కంటి సంరక్షణ ఎంతో అవసరమని వాసన్ ఐ కేర్ చందానగర్ ఇంచార్జి, చీఫ్ సర్జన్ సీనియర్ కన్సల్టెంట్ సర్జన్ డాక్టర్ రతన్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం చందానగర్ గంగారంలోని వాసన్ ఐ కేర్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ వాసన్ ఐ కేర్ ఆసుపత్రి నిరుపేద, మధ్య తరగతి వారికి కూడా అందుబాటులో ఉందన్నారు. ఈ నెల 7 వ తేదీ నూతన యంత్ర పరికరాలతో ఆసుపత్రిని ప్రారంభిస్తున్నామన్నారు.